క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఉదయగిరి/దుత్తలూరు: ఉదయగిరి, దుత్తలూరులోని ఎరువుల దుకాణాలను వింజమూరు ఏడీఏ ఎస్ రామిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లను తనిఖీ చేసి నిల్వలను పరిశీలించారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులను ఎమ్మార్పీకే కన్నా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఓలు ఆంజనేయులునాయక్, ఎన్ వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్, రవికుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



కావలి: కావలిలోని రైల్వే ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు రైల్వే స్టేషన్‌లో ఒంగోలుకు చెందిన కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 210 మందికి ఈసీజీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు కపిల్ కార్తీక్‌రెడ్డి, అశోక్‌కుమార్, ఐ వెంకటేశ్వరరెడ్డి, రామాంజనేయులు, రైల్వే సిబ్బంది, ఒంగోలు ఏసీఎస్ ఈ వెంకట రమణారావు, ఎస్‌ఎంఆర్ కావలి అశోక్‌రెడ్డి, ఏఐటీఎంయూ సెక్రటరీ ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ మండలంలోని ఇంటింటిని సందర్శించి 15 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న వారి విద్యార్హతలు, కుటుంబ నేపథ్యం, వృత్తి నైపుణ్యం, తదితర అంశాలను గుర్తించి నైపుణ్యం యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన

మర్రిపాడు: మండలంలోని పొంగూరులో సీఐడీ డీఎస్పీ కోటారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్‌రావు, సీఐ గంగాధర్‌రావు, ఎస్సై శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దారు అనిల్‌కుమార్‌యాదవ్, ఎంఈఓ ధనలక్ష్మి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు పాల్గొన్నారు.

పట్టాదారుల పేర్ల తొలగింపుపై నిరసన

ఉదయగిరి: బిజ్జంపల్లిలో తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సును శుక్రవారం నిర్వహించారు. రీసర్వేకు సంబంధించిన సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీపీఎం రైతు సంఘం ఆధ్వర్యంలో పేదలకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములకు సంబంధించి పట్టాదారు పేర్లను తొలగించడంపై నిరసన తెలిపారు. భూములను సాగుచేసుకుంటూ బ్యాంకుల్లో రుణాలను తీసుకుని ఉన్నా రెవెన్యూ రికార్డుల్లో పట్టదారుల పేర్లను తొలగించి ప్రభుత్వ భూములుగా నమోదు చేయడం ఏమిటని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. స్పందించిన తహసీల్దార్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు.

మహిమలూరు పాఠశాల పరిశీలన

ఆత్మకూరురూరల్: మహిమలూరులోని ప్రభుత్వ పాఠశాలను ఆత్మకూరు డిప్యూటీ ఈఓ గోపాల్ శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు బోధనతో పాటు శారీరక, మానసిక అభ్యున్నతికి ఉపాధ్యాయులు చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించి ప్రశంసించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తాను కూడా మహిమలూరుకు చెందిన వ్యక్తినేనని, తన చిన్నతనంలో ఇదే పాఠశాలలో చదివానని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఓను హెచ్‌ఎం ఇస్మాయిల్,ఉపాధ్యాయులు, సత్కరించారు.

ఎస్సై, ఎంపీడీఓకు సన్మానం

సీతారామపురం: మండల నూతన ఎంపీడీఓ, ఎస్సై భాస్కర్, శివకృష్ణారెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ చెరువుపల్లి రమణారెడ్డి, సీతారామపురం బిట్-1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు, మాజీ వైఎస్‌ఎంపీపీ రామిశెట్టి తిరుపతయ్య, కోఆప్షన్ సభ్యుడు షేక్ హైదర్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

దుత్తలూరు: మండలంలోని తెడ్డుపాడు సమీపం నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ఉన్నతాధికారులు అందజేసిన సమాచారం మేరకు పోలీసులు గురువారం రాత్రి దాడులు నిర్వహించారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న జేసీబీతో పాటు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పీ ఆదిలక్ష్మి తెలిపారు.

స్టేడియం కల నెరవేరేనా?

పట్టణంలోని క్రీడాకారుల చిరకాల స్వప్నం స్టేడియం నిర్మాణం. ఈ కల రెండు దశాబ్దాలకుపైగా ఊరిస్తూనే ఉంది. స్టేడియం నిర్మాణానికి పలువురు నేతలు హామీలు ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం స్పోర్ట్స్ ఫర్ ఆల్ విధానంతో నూతన క్రీడా పాలసీని తెరపైకి తీసుకొచ్చిన నేపథ్యంలో స్టేడియం నిర్మాణంపై క్రీడాకారుల్లో మరోసారి ఆశలు చిగురించాయి.



స్టేడియానికి కేటాయించిన స్థలం

కావలి: పట్టణానికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న నేపథ్యంలో అన్ని వసతులున్న స్టేడియం నిర్మాణం అవసరమన్న విషయాన్ని 2000 సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డి గుర్తించారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డు పక్కన ఉన్న రెవెన్యూశాఖకు చెందిన 9 ఎకరాల స్థలాన్ని స్టేడియం నిర్మాణం కోసం క్రీడా శాఖకు కేటాయించేలా చర్యలు చేపట్టారు. క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, టెన్నిస్, బాల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్‌పూల్‌తో పాటు ఇతర క్రీడలకు అవసరమైన వేదికలతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. అందుకు రూ.50లక్షల అంచనాతో 2001 ఫిబ్రవరి 10న అప్పటి హోం మంత్రి దేవేంద్రగౌడ్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. ఆ తర్వాత బీద మస్తాన్‌రావు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మంత్రిగా ఉన్న ఆనం రామా నారాయణరెడ్డిని కావలికి తీసుకొచ్చి రూ.4.70 కోట్లతో స్టేడియం నిర్మిస్తున్నామని శిలాఫలకాన్ని 2014 ఫిబ్రవరి 16న ఆవిష్కరింపజేశారు. మళ్లీ 2017 మార్చి 5న కేంద్ర మంత్రిగా ఉన్న వెంకయ్యనాయుడితో నెల్లూరులో మరో శిలాఫలకాన్ని ఆవిష్కరింపజేశారు. రూ.2 కోట్లతో కావలిలో స్టేడియం నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు కూడా స్టేడియం నిర్మాణానికి సంబంధించిన పనులు ఏమీ జరగలేదు.

క్రీడల్లో రాణిస్తున్నా..

స్టేడియం నిర్మాణానికి 2000లో అడుగులు పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 24 ఏళ్ల కాలంలో పట్టణ స్థితిగతులు పూర్తిగా మారిపోయాయి. ప్రస్తుతం పట్టణం ప్రభుత్వ రికార్డుల ప్రకారమే 61.09 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది. జనాబా 2.5 లక్షల మందికిపైగా ఉన్నారు. పట్టణం నాలుగు ఇంజినీరింగ్ కళాశాలలు, నాలుగు డిగ్రీ కళాశాలలు, పది జూనియర్ కళాశాలలు, మూడు వృత్తి కళాశాలలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 70 ఉన్నాయి. వీటిల్లో 15వేల మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. వీరందరికీ క్రీడల్లో శిక్షణకు, నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి స్టేడియం అన్ని రకాలుగా ప్రోత్సాహకంగా ఉంటుంది. అంతే కాకుండా ఇతర రంగాల్లో ఉన్న వ్యక్తులు క్రీడలపై ఆసక్తితో తమ సామర్థ్యం నిలకడగా ఉండడానికి ప్రాక్టీస్ చేస్తుంటారు. వీరికి కూడా స్టేడియం అనుకూలంగా ఉంటుంది. కానీ 24 ఏళ్లుగా స్టేడియం నిర్మాణానికి నోచుకోకపోవడంతో క్రీడాకారుల్లో నిరాశ, నిస్పృహలు నెలకొన్నాయి. క్రీడలపై ఆసక్తి ఉన్న కొందరు తమకు తోచిన చోట ప్రాక్టీస్ చేస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. పట్టణానికి చెందిన సీహెచ్ తిరుమలరెడ్డి పరుగు పందెంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటారు. ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో పోలీసు ఉద్యోగం సాధించి ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే కావలికి చెందిన కోటేశ్వరమ్మ క్రీడాకారిణిగా రాణించి జవహర్ భారతి కళాశాలలో ఫిజికల్‌డైరెక్టర్ ఉద్యోగం సాధించి విరమణ కూడా పొందింది. ఆమె ఇప్పటికీ వెటరన్ క్రీడా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తూనే ఉంది. అలాగే బుడంగుంటకు చెందిన పాల్ అనే క్రీడాకారుడు, సరిత అనే క్రీడాకారిణి జాతీయ స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో సత్తా చాటి స్పోర్ట్స్ కోటాలో రైల్వే శాఖలో ఉద్యోగం పొందారు. అలాగే రామసుబ్బమ్మ అనే వృద్ధురాలు వెటారన్ క్రీడా పోటీల్లో పాల్గొంటూ పతకాలు సాధిస్తోంది. ఇలా కావలి నుంచి ఎంతో మంది క్రీడాకారులుగా ఎదుగుతున్నా స్టేడియం నిర్మాణం మాత్రం కలగానే మారింది.

నూతన క్రీడాపాలసీతో చిగురించిన ఆశలు

రాష్ట్ర ప్రభుత్వం 'స్పోర్ట్స్ ఫర్ ఆల్' విధానంతో నూతన క్రీడా పాలసీని తెరపైకి తీసుకొచ్చింది. అందరికీ ఆటలు, క్రీడానైపుణ్యం గుర్తింపు, ప్రపంచ స్థాయి శిక్షణ, ప్రోత్సాహకాలు, క్రీడాకారులకు మద్దతు, ఉద్యోగ భద్రత, ప్రపంచ స్థాయి సౌకర్యాలు, క్రీడా సంఘాలతో సమన్వయం, టెక్నాలజీ వాడకం, ప్రైవేట్ రంగంతో కలిసి పనిచేయడం, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఈవెంట్స్ నిర్వహణ, స్పోర్ట్స్ టూరిజం వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటి వరకు ఉద్యోగాల్లో ఉన్న స్పోర్ట్స్ రిజర్వేషన్ కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుంది. యూనిఫామ్ సర్వీసెస్‌లో 3 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పాలసీలో ప్రతిపాదించింది. ఒలంపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్‌లో పతకాలు పొందిన క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాన్ని భారీగా పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గ, డివిజన్ కేంద్రంగా, జిల్లాలో రెండో అతి పెద్ద పట్టణంగా ఉన్న కావలి క్రీడాకారుల్లో స్టేడియం నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి.

స్టేడియం నిర్మాణం చేపట్టాలి



పట్టణానికి చెందిన ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తున్నారు. స్టేడియం నిర్మిస్తే క్రీడాకారులకు మరింత శిక్షణిచ్చేందుకు కోచ్‌లు రావడానికి మార్గం ఏర్పడుతుంది. స్టేడియం, కోచ్‌లు అందుబాటులో ఉంటే యువత క్రీడలపై శ్రద్ధ చూపుతారు. కావలికి చెందిన కుంతూరు రవికుమార్ వంటి కోచ్‌లు స్టేడియం లేకపోవడంతో నెల్లూరుకు వెళ్లి శిక్షణ ఇస్తున్నారు. ప్రభుత్వం స్పందించి స్టేడియం నిర్మించి క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసుకురావాలి.

– సమాధి గిరిబాబు, అధ్యక్షుడు, అమెచ్యూర్ అథ్లెటిక్ అసోసియేషన్, కావలి

ప్రతిపాదనలు పంపాం

ఇటీవల క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కావలికి తీసుకొచ్చిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి స్టేడియానికి సంబంధించిన 9 ఎకరాల స్థలాన్ని చూపించారు. స్టేడియం నిర్మించాల్సిన ఆవశ్యకతను మంత్రికి వివరించారు. మంత్రి ఆదేశాల మేరకు స్టేడియం స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం, గ్రౌండ్ లెవలింగ్, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ ఇంజనీర్ల ద్వారా పనులు చేపట్టడానికి అవసరమైన ప్లానింగ్, నిధులు తదితర అంశాలతో కూడిన నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంది. ఆ తర్వాత ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభమవుతాయి.

–ఆర్‌కే యతిరాజ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, నెల్లూరు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం



ఉప్పుతో తీర్చిదిద్దిన భారీ శివలింగాకృతి

సంగం: కార్తీక మాసం కోటి సోమవారాన్ని పురస్కరించుకుని స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉప్పుతో భారీ శివలింగాకృతిని తీర్చిదిద్ది చుట్టూ భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. సంగానికి చెందిన కాకు మురళి, మదన్ ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో విశ్వేశ్వర లింగానికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివసహస్రనామార్చన జరిపారు. సాయంత్రం శివాలయం ప్రాంగణంలో మహిళలు దీపాలు వెలిగించారు. వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం పూజల అనంతరం మహిళలు దీపాలు వెలిగించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలో ఉన్న పద్మావతి ఆండాల్ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం కోటి సోమవారం, శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని దేవదేవేరుల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు.

భూ వివాదం నేపథ్యంలో దాడి

ఆత్మకూరు (చేజర్ల): చేజర్ల మండలం కొల్లపనాయుడుపల్లిలో భూ వివాదం నేపథ్యంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న దాడిలో ముగ్గురు గాయపడ్డారు. గ్రామస్తులు, బాధితుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శారద, శివశంకర్‌రెడ్డి దంపతులకు సమీప బంధువులైన ఓబుల్‌రెడ్డి, కిషోర్, జితేంద్ర, ఈశ్వరయ్య, రత్నమ్మతో గత కొంత కాలంగా భూ వివాదం సాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం ఓబుల్‌రెడ్డి, తదితరులు పొలం దున్నుతుండగా శివశంకర్‌రెడ్డి దంపతులు అడ్డుకున్నారు. ఇది తమకు సంబంధించిన పొలమని దంపతులు చెప్పినా వినకుండా ట్రాక్టర్‌తో దున్నుతూ ఓబుల్‌రెడ్డి వర్గీయులు దాడికి పాల్పడ్డారు. ప్రాణభయంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని దంపతులు వాపోయారు.ఈ క్రమంలో శుక్రవారం రాత్రి ఇంటి దగ్గర ఉన్న శివశంకర్‌రెడ్డి దంపతులపై ఓబుల్‌రెడ్డి, కిషోర్, ఈశ్వరయ్య, జితేంద్ర, రత్నమ్మ దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో శివశంకర్‌రెడ్డికి నుదుటిపై తీవ్ర గాయమైంది. మిగిలిన వారికి గాయాలయ్యాయి. వారిని సమీప బంధువులు ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న చేజర్ల పోలీసులు నింపాదిగా ఆత్మకూరు ఆస్పత్రికి వచ్చి కేసు వివరాలు నమోదు చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేయనున్నట్లు వారు తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన చేజర్ల

ఉదయగిరి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని నివాసంలో ఉదయగిరి నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు చేజర్ల సుబ్బారెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ నెల 17న నెల్లూరులో తన రెండో కుమారుడు చేజర్ల సురేష్‌రెడ్డి వివాహం జరగనున్న నేపథ్యంలో ఆహ్వానపత్రికను అందజేశారు. ఆయనతో పాటు డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఉదయగిరి మండల మాజీ వైస్‌ఎంపీపీ బాలిబోయిన శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

25 మద్యం సీసాల పట్టివేత

దుత్తలూరు: ఉదయగిరి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలపై శుక్రవారం దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ పీ లక్ష్మణస్వామి తెలిపారు. ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారం మేరకు నెల్లూరు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఉదయగిరి ఎక్సైజ్ పోలీసులు సంయుక్తంగా నందిపాడు, చింతలగుంట గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుదుకాణాలపై దాడులు నిర్వహించి 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బత్తుల నరసింహులు, దాసు శ్రీనివాసులు అనే వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ఇబ్బందులు

ఆత్మకూరు: పట్టణంలో ఏర్పాటు చేస్తున్న అదానీ స్మార్ట్ మీటర్లతో వినియోగదారులకు ఇబ్బందులు తప్ప మేలు జరగదని, వాటి ఏర్పాటు ప్రక్రియను నిలిపివేయాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కృష్ణప్రసాద్ కోరారు. ఈ మేరకు విద్యుత్ శాఖ డీఈఈ శ్రీనివాసులును శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల నిరక్షరాస్యులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉన్నందున, వాటి ఏర్పాటుపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు.

ఆశీర్వచనం

కలిగిరి: స్థానిక అవుల రమణారెడ్డి కల్యాణ మండపంలో శనివారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నోటి జనార్దన్‌రెడ్డి కుమార్తె పల్లవి వివాహ వేడుకకు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. వధువును ఆశీర్వదించారు. స్థానిక నాయకులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కలిగిరి, వింజమూరు జెడ్పీటీసీలు పాలూరు మాల్యాద్రిరెడ్డి, గణపం బాలకృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఓటరు నమోదుకు అవకాశం

వింజమూరు(ఉదయగిరి)/ఆత్మకూరు(చేజర్ల): : వింజమూరు, చేజర్ల మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు సయ్యద్ హమీద్, ఇన్‌చార్జి తహసీల్దార్ మస్తానయ్య శుక్రవారం తెలిపారు. బీఎల్వోలు పోలింగ్ కేంద్రాల వద్ద ముసాయిదా ఓటర్ల జాబితా, ఫారం-6, ఫారం-7, ఫారం-8లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఓటర్లు ఓటరు జాబితాలో తమ పేర్లను పరిశీలించుకుని మార్పులు చేర్పులు చేసుకోవచ్చని తెలిపారు.

ఆర్‌ఎస్సార్‌లో 'న్యూస్‌లెటర్' ప్రారంభం

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఎలక్ట్రాన్' పేరుతో ప్రత్యేక న్యూస్‌లెటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన అన్నీ వివరాలు, సెమిస్టర్ల వారీగా జరిగే కార్యక్రమాలు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి కోసం నిర్వహించే ప్రత్యేక శిక్షణా తరగతులు, జాబ్‌మేళాలకు సంబంధించిన వివరాలు, తదితర అంశాలను విద్యార్థులు, యూనివర్సిటీకి న్యూస్‌లెటర్ రూపంలో తెలియజేయనున్నట్లు ప్రిన్సిపల్ పీవీఎస్ రెడ్డి తెలిపారు. కళాశాల ఏఓ ఆర్వీ రమణారెడ్డి, ఈసీఈ విభాగాధిపతి సునీల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి నిధులు కేటాయించాలి

ఆత్మకూరు/ఉదయగిరి/మర్రిపాడు: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆవాజ్ కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు ఆత్మకూరులోని పాత సినిమాహాల్ సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ముస్లింలు శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్, ఖలీల్, షరీఫ్, ఎస్కే నాయబ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉదయగిరి, మర్రిపాడులోనూ ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో మైనార్టీలు తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు.

పార్టీలకతీతంగా ఉపాధి పనులు కల్పించాలి



దుత్తలూరు:మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి



సీతారామపురం: అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ అల్లూరురాజు

సీతారామపురం: పార్టీలకతీతంగా గ్రామాల్లోని ప్రతిఒక్కరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధికారులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మాట్లాడారు. సర్పంచ్‌లను కాదని కాంట్రాక్టర్లకు ఉపాధి పథకం కింద అభివృద్ధి పనులను అప్పగించడం ఎంతవరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. మండలాభివృద్ధిలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లను సమన్వయం చేసుకుంటూ అధికార యంత్రాంగం ముందుకెళ్లాలని, అలా కాకుండా ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు. అధికార పార్టీ వారికే ఉపాధి పనులు కల్పిస్తే ప్రజలు తిరగబడక తప్పదన్నారు. పాత పనులకు పైపైన మెరుగులు దిద్దుతూ, యంత్రాలతో పనులు చేపడుతూ కూలీల కడుపుకొట్టడం తగదన్నారు. ఉపాధి గ్రామ సభలు ఎక్కడ జరుగుతున్నాయి, ఏఏ పనులు ప్రతిపాదించారో స్పష్టంగా ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. గుండుపల్లి సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి, సీతారామపురం బిట్-1 ఎంపీటీసీ పీసీ అల్లూరురాజు అభివృద్ధి పనులపై అధికార యంత్రాంగం చొరవ చూపడం లేదని ధ్వజమెత్తారు. స్పందించిన ఎంపీడీఓ భాస్కర్ మాట్లాడుతూ ఇకపై అలాంటి పొరపాట్లు జరగవని, అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లేలా చర్యలు చేపడుతామన్నారు. జెడ్పీటీసీ రమణారెడ్డి, వైస్‌ఎంపీపీలు కృష్ణారెడ్డి, శారమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలి

దుత్తలూరు: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు శాఖలవారీగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. పలువురు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే మండలస్థాయి అయితే తాను పరిష్కరిస్తానని, లేదంటే జెడ్పీ స్థాయికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వైనాగరాజు, ఎంపీడీఓ వై.వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మేలుజాతి పశువులతో అధిక పాల దిగుబడులు



దూడలకు బహుమతుల ప్రదానం

సంగం: మండలంలోని మర్రిపాడులో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ఉచిత పశు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. 74 పశువులకు గర్భకోశ పరీక్షలు చేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్‌నాయక్, కోవూరు డీఎల్‌డీఏ డీడీ శ్రీనివాసరావు, వీసీసీ డీడీ టీ సోమయ్య హాజరై పాడిరైతులకు పశుపోషణపై అవగాహన కల్పించారు. కృత్రిమ గర్భధారణ ద్వారా మేలుజాతి పశువులను పొందవచ్చని, తద్వారా అధిక పాల దిగుబడులను సాధించవచ్చని తెలిపారు. అనంతరం పెయ్య దూడల ఉత్పత్తి పథకం, మేలుజాతి పశుగ్రాసాలపై అవగాహన కల్పించారు. 74 పశువులను పరీక్షించారు. మేలు జాతి పశుగ్రాసాల అభివృద్ధి గురించి తెలిపారు. ప్రతి రైతు పశుగ్రాసాన్ని పెంచే విధంగా అవగాహన కల్పించారు. రైతులకు రూ.20వేల విలువైన మందులు, మినరల్ మిక్చర్‌ను పంపిణీ చేశారు. దూడలకు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగించారు. అనంతరం ఆరోగ్యకరమైన దూడల పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. సర్పంచ్ సురేష్, స్థానిక పశువైద్యాధికారి డీ స్రుజని, వీఏఏలు పాల్గొన్నారు.

శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కావలి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కావలి డిపో నుంచి శైవక్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్ రాపూరు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. శ్రీశైలానికి ఈ నెల 10, 17, 24 తేదీల్లో ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు చెప్పారు. ఒక్కరికి పోనురాను టికెట్ ధర రూ.850గా నిర్ణయించినట్లు తెలిపారు. శ్రీశైలం దర్శించుకోవాలనుకునే ప్రయాణికులు ఆన్‌లైన్‌లో సర్వీసు నంబర్ 94472కు రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు. అలాగే అరుణాచలం క్షేత్రానికి ఈ నెల 14న ప్రత్యేక సర్వీస్ నడుపుతున్నట్లు చెప్పారు. ఒక్కరికి పోనురాను టికెట్ ధర రూ.1400గా నిర్ణయించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో సర్వీసు నంబర్ 94472పై రిజర్వేషన్ పొందవచ్చని తెలిపారు. పంచారామ క్షేత్రాలైన అమరారామం(అమరావతి), సోమరామం (భీమవరం), క్షీరారామం(పాలకొల్లు), ద్రాక్షారామం(తూర్పుగోదావరి), కుమారారామం(సామర్లకోట)కు ఈ నెల 10,17, 24 తేదీల్లో ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశామని చెప్పారు. ఒక్కరికి పోనురాను టికెట్ ధర రూ.2,200గా నిర్ణయించినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో సర్వీస్ నంబర్ 95030పై రిజర్వేషన్ పొందవచ్చని వివరించారు. కావలి బస్‌స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లోనూ టికెట్లు పొందవచ్చని తెలిపారు. వివరాలకు 94939 13989, 99660 09395 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అందరికీ న్యాయం అందితేనే సమానత్వం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శోభ

కావలి: పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ న్యాయం అందితేనే సమానత్వం సాకారమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి ఎం శోభ పేర్కొన్నారు. కావలి న్యాయ స్థానాల ప్రాంగణంలో జాతీయ న్యాయసేవా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో జడ్జి ఎం శోభ మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచితంగా న్యాయ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్ వరలక్ష్మి, స్పెషల్ మేజిస్ట్రేట్ పీ పరుశురాం, న్యాయవాదులు రోజ్‌దార్, కెన్నెడీ, సాయిప్రసాద్, లోక్ అదాలత్ మెంబర్ ఎం మాలకొండారెడ్డి, తదితరులు మాట్లాడారు. కావలి బార్ అసోసియేషన్ సెక్రటరీ జయప్రకాష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కావలి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా పట్టణంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ వై వసంతరావు శుక్రవారం తెలిపారు.

సంగం: మండలంలోని సంగం, సిద్ధిపురం, మర్రిపాడు సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా వాటి పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఉడతా మన్మధరావు శుక్రవారం తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇవ్వనున్నట్లు వివరించారు.

వింజమూరు (ఉదయగిరి): వింజమూరు మండలం మోటుచింతలపాళెం, కాటేపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ షేక్ నాగూర్‌వలి శుక్రవారం తెలిపారు.

సోమశిల: సోమశిల, రేవూరు విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

లారీని ఢీకొన్న ఆటో: ముగ్గురికి తీవ్రగాయాలు

సంగం: మండలంలోని పెరమన వద్ద ముంబై జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుకగా ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. పొద్దుటూరుకు చెందిన రాజశేఖర్, శ్రీకాంత్, వెంకటసుబ్బయ్య ఆటోలో బుచ్చిరెడ్డిపాళెం వస్తున్నారు. ఈ క్రమంలో పెరమన వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వెనుకగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను సంగం, ఏఎస్‌పేట 108 వాహనాల్లో ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.